
సాక్షి పల్నాడు

శనివారం, 9, మార్చి, 2024



ఎన్నికల ప్రచార రథం ప్రారంభం


వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాల్లో భాగంగా జయహో జయహో మా బ్రహ్మన్న అనే పాటను, ప్రచార రథాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 514.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 3,031, ఎస్ఎల్బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6500, గరిష్ట ధర రూ.7800, మోడల్ ధర రూ.7200 వరకు పలికింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ సంస్కృత మూల్యాంకనం

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సంస్కృత పేపర్ల స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను శనివారం ప్రారంభిస్తున్నట్లు ఆర్ఐవో జీకే జుబేర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని సంస్కృత అధ్యాపకులందరు తప్పనిసరిగా హాజరు కావాలని, మిగిలిన సబ్జెక్టుల స్పాట్ వాల్యుయేషన్ షెడ్యూల్‌ను బోర్డు ప్రకటిస్తుందని తెలిపారు.

రేపు చేబ్రోలులో రథోత్సవం

చేబ్రోలు : చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని గంగాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి రథోత్సవ కార్యక్రమం ఆదివారం జరుగుతుందని దేవదాయ శాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మహాశివరాత్రి పండుగ రోజున నాగేశ్వర స్వామి, గంగా పార్వతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 3 గంటలకు స్వామివారి రథోత్సవం జరుగుతుందని తెలిపారు.

దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు పట్టు వస్త్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై జరిగే దుర్గామల్లేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవానికి మంగళగిరి చేనేత పట్టువస్త్రాలను శుక్రవారం సమర్పించారు. శ్రీ శివ భక్త మార్కండేయ వంశీకులు ప్రతి ఏడాది మహా శివరాత్రికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. మార్కండేయ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు గంజి చిరంజీవి, రాధ దంపతులు, చిల్లపల్లి శ్రీనివాసరావు, గౌరీ దంపతులు అమ్మవారికి, అయ్య వార్లకు పట్టువస్త్రాలను తీసుకుని ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కెఎస్.రామారావు సాదరంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని అమ్మవారిని, మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని వస్త్రాలను సమర్పించారు. పట్టు వస్త్రాలను భక్తి శ్రద్ధలతో చేనేత మగ్గాలపై వారం రోజుల పాటు తయారు చేశామని పేర్కొన్నారు. చిల్లపల్లి మోహనరావు, అందే నాగప్రసాద్, గుత్తికొండ ధనుంజయరావు, అవ్వారు శ్రీనివాసరావు, బిట్రా శ్రీనివాసరావు, వేణు, ట్రస్ట్ సభ్యుల కుటుంబీకులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై మహా శివరాత్రి రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రిని పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం, మహా శివరాత్రి నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న ఆది దంపతులను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము మూడు గంటల నుంచే దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మల్లేశ్వరాలయానికి చేరుకుని స్వామి వారికి విశేష అభిషేకాలు జరిపించుకున్నారు. శివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరి ఉండటంతో సర్వ దర్శనం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులను రూ.100, రూ.300 టికెట్ క్యూలైన్లలోకి ఉచితంగా అనుమతించారు. మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో భక్తులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సుమారు వంద మందికి పైగా ఉభయదాతలు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆది దంపతులను దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

చేదుకో కోటయ్యా...



స్వామి వారికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్

జనశివతాండవం

- కోటప్పకొండ తిరునాళ్లకు భారీగా హాజరైన భక్తులు
- సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూ లైన్లు ఏర్పాట్లు
- కోటయ్యను దర్శించుకున్న రాజకీయ ప్రముఖులు
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట/నరసరావుపేట రూరల్: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారి దేవస్థానం శివనామస్మరణతో మారుమ్రోగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు శుక్రవారం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున స్వామి దర్శనం కోసం తరలిరావడంతో కోటప్పకొండ పుణ్యక్షేత్రం భక్తజన సందోహంతో నిండిపోయింది. తెల్లవారుజామున రెండు గంటలకు బిందెతీర్థంతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు అప్పయ్యగురుకుల్ ఆధ్వర్యంలో అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. స్వామి వారి దర్శనం కోసం అర్ధరాత్రి నుంచి భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ఉచిత దర్శనంతోపాటు రూ.100, రూ.200, వీఐపీలు, అభిషేక క్యూల ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులతో క్యూకాంప్లెక్స్ కిక్కిరిసింది. ఉచిత దర్శనంలో భక్తుల తాకిడి అధికంగా కనిపించింది. గతంతో పోల్చితే ఈ ఏడాది క్యూలైన్ల ఏర్పాటు బాగుండటంతో భక్తులు త్వరగా దర్శనం పూర్తి చేసుకున్నారు. అభిషేక మండపంలో నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోపాన మార్గం నుంచి భక్తులు మెట్ల పూజ నిర్వహించుకుంటూ కొండపైకి చేరుకున్నారు. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట, నంది విగ్రహం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. త్రిముఖ శివ లింగం వద్ద యాత్రికులు సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. పలువురు భక్తులు కాలినడకన పాతకోటయ్య స్వామి ఆలయం వద్దకు చేరుకుని దర్శించుకున్నారు. కొండ క్రింద నుంచి 80 తిరుమల–తిరుపతి సప్తగిరి బస్సుల్లో ఆర్టీసీ యాత్రికులను చేరవేశారు. ఘాట్‌రోడ్డులో ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఎక్కడా ట్రాఫిక్ జామ్ అవ్వకుండా పోలీస్ సిబ్బంది కట్టుదిట్టంగా చర్యలు తీసుకున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి అక్కడే ఉండి స్వయంగా పర్యవేక్షించారు.

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

త్రికోటేశ్వరస్వామి వారిని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్‌లు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్ మురుగుడు హనుమంతరావులు, వెంపాడ చిరంజీవి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలు దర్శించుకున్నారు. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాంప్రసాద్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. హైకోర్టు న్యాయమూర్తి బి కృష్ణమోహన్, సురేష్‌రెడ్డిలు త్రికోటేశ్వరున్ని దర్శించుకున్నారు.

ఏర్పాట్లు పర్యవేక్షించిన అనిల్, గోపిరెడ్డి

స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు అందుతున్న సౌకర్యాలను వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు పర్యవేక్షించారు. వీరు ఆర్టీసీ బస్సులో సామాన్య ప్రజలతోపాటు కొండకు చేరారు. కొండపైన, కింద ఉన్న సత్రాలలో పర్యటిస్తూ భక్తులతో మాట్లాడారు. ఆలయంలో ఏర్పాట్లపై ప్రశ్నించారు. క్యూలైన్‌లో తాగునీరు, మజ్జిగ అందించారా అంటూ ప్రశ్నించారు. ఏర్పాట్లు బాగున్నాయని, దర్శనం త్వరగా పూర్తవుతోందని భక్తులు తెలిపారు.

ఆకట్టుకున్న విద్యుత్ ప్రభలు

కోటప్పకొండ అనగానే గుర్తు వచ్చేది భారీ విద్యుత్ ప్రభలు. ప్రభలను చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ ఏడాది 20 విద్యుత్ ప్రభలు కోటప్పకొండకు తరలివచ్చాయి. ఇందులో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి 16, నరసరావుపేట నియోజకవర్గం నుంచి నాలుగు ప్రభలు వచ్చాయి. ఇందులో అత్యధికంగా పురుషోత్తమపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి ఉన్నాయి. కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, అమిన్‌సాహెబ్‌పాలెం, కోమటినేనివారిపాలెం, అప్పాపురం, కావూరు గ్రామాల నుంచి ఒక్కో ప్రభ ఉన్నాయి. నరసరావుపేట నాలుగింటిలో కాకాని గ్రామం నుంచి రెండు, గురవాయపాలెం, ఉప్పలపాడుల నుంచి ఒక్కొక్కటి వచ్చాయి. విద్యుత్ ప్రభల వెలుగులతో కోటప్పకొండ కింద భాగం దేదీప్యమానంగా వెలిగిపోయింది. కొండపై నుంచి ఆ దృశ్యం చూడటానికి రెండు కళ్లు చాలలేదు. ప్రభల వద్ద ఏర్పాటు చేసిన వినోద కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

భక్తులకు విస్తృత సౌకర్యాలు

స్వామి వారి దర్శనానికి వచ్చే యాత్రికులకు ఆలయ అధికారులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లోని భక్తులకు తాగునీరు, పాలు, మజ్జిగ, అరటిపండు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆరు క్యూలైన్‌ల ద్వారా భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. దీంతో ఉచిత దర్శనానికి రెండు గంటలు, ఇతర దర్శనాలకు గంట పాటు సమయం పట్టింది. దర్శనాలు త్వరగా పూర్తి అవుతుండడంతో భక్తులు సంతృప్తి వ్యక్తంచేశారు.



అలంకరణలో స్వామి వారి మూలవిరాట్

మళ్లీ జగనే సీఎం కావాలి...

రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నాను. ఆయన అవసరం ఈ రాష్ట్రానికి ఎంతో ఉంది. కోటప్పకొండ అభివృద్ధికి సీఎం జగన్ ఎంతో చేశారు. నంది విగ్రహం, సత్రాలు, సెంట్రల్ లైటింగ్ వంటి ఎన్నో పనులు పూర్తి చేశాం. రెండో ఘాట్ రోడ్డు, పాత కోటయ్య స్వామి మెట్ల మార్గం పనులు ఎన్నో చేయనున్నాం.

– గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే,నరసరావుపేట

ప్రజలందరికి మంచి జరగాలి....

పల్నాడు ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు. ఆ శివుని ఆశీస్సులు సీఎం జగనన్నకు ఉండాలని కోరుకున్నా. ప్రజలందరి కుటుంబాల్లో మంచి జరగాలి. 2024లో జరిగే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ గెలిచి ప్రజలకు మేలు చేసే అవకాశం ఇవ్వాలని కోటయ్యను వేడుకున్నాను.


– అనిల్‌కుమార్ యాదవ్, వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త



పోలీసులకు అభినందనలు

కోటప్పకొండ తిరునాళ్ల బందోబస్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందికి అభినందనలు. మండుటెండను సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పోలీసులు విధులు నిర్వర్తించారు. పోలీసు శాఖకు సహకరించిన తోటి శాఖల అధికారులు, భక్తులకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

– వై రవిశంకర్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ



కోటప్పకొండలో క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు



శివాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు



స్వామి వారికి పూజలు చేస్తున్న ఐజీ పాలరాజు దంపతులు



కోటప్పకొండలో జన సందోహం

సీఎం వైఎస్ జగన్‌తోనే మహిళా సాధికారత

- మహిళల ఆత్మగౌరవాన్ని పెంచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



సత్కారం అందుకున్న డాక్టర్ గీతాహాసంతితో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలతో మహిళా సాధికారత సాధ్యమైందని, రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవం మరింత పెరిగిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహాసంతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి రాంబాబు మాట్లాడుతూ మహిళా సాధికారతను మాటల్లో కాకుండా ఆచరణలో పెట్టి అనేక సంక్షేమ పథకాలు మహిళలకు అందిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో తన పరిపాలన హయాంలో ఎక్కడ దోపిడీలు, అక్రమాలు చేయలేదని, ఎవరిని వేధించలేదని మీరు నమ్మితే ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నానన్నారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి మాట్లాడుతూ ఇది మహిళా పక్షపాత ప్రభుత్వం అన్నారు. మహిళలపై అఘాయిత్యాలు చోటు చేసుకోకుండా ప్రత్యేకంగా దిశా చట్టాన్ని తీసుకువచ్చి అండగా నిలిచారన్నారు. సంక్షేమానికి సంబంధించిన ప్రతి పథకం లబ్ధి మహిళలకే వర్తింపచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ముప్పాళ్ల ఎంపీపీ పద్మ, సత్తెనపల్లి, రాజుపాలెం, ముప్పాళ్ల మండలాల జెడ్పీటీసీ సభ్యులు సంకటి నాగేశ్వరమ్మ, సునీతారెడ్డి, శశికళ, వంశీ స్పెషాలిటీ వైద్యశాల వైద్యురాలు షకీలా శ్రీధర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యురాలు రోళ్ల మాధవిరెడ్డి, శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్ ప్రిన్సిపాల్ ఎం.గీతాంజలి, వృంద మహిళా జూనియర్ కళాశాల డైరెక్టర్ అనూషా గంగారపు, గీతా మల్టీస్పెషాల్టీ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ అనిత, సీడీపీఓ శ్రీలత, మెప్మా టీఎంసీ నాగేశ్వరీలు మాట్లాడారు. అతిథులను మంత్రి అంబటి, డాక్టర్ గీతా హసంతిలు సత్కరించారు. వేడుకలకు జేసీఎస్ ఇన్‌చార్జి, కోఆప్షన్ మెంబర్ కొణతం స్వాతి అధ్యక్షత వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో మహిళలు ద్విచక్రవాహనాలతో పట్టణ పురవీధుల నుంచి మంత్రి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మహిళలు విశేషంగా తరలివచ్చారు.

రాష్ట్ర పన్నుల శాఖ డీసీటీవో సస్పెన్షన్

పాతగుంటూరు: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించిన గుంటూరు బ్రాడీపేట సర్కిల్ డీసీటీవో ఎ.మంజులను సస్పెండ్ చేస్తూ ఈనెల 7వ తేదీన రాష్ట్ర పన్నుల ముఖ్య కమిషనర్ గిరిజాశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. బ్రాడీపేట సర్కిల్‌లో జరిగిన ట్రేడర్స్ అక్రమాలు, అధికారుల విధుల నిర్లక్ష్యంపై గతేడాది ఆగష్టులో సాక్షిలో ప్రచురితమైన కథనంపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అధికారిపై చర్యలు తీసుకోవడంలో 9 నెలలపాటు నిర్లక్ష్యం వహించిన కొందరు ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లుగా తెలిసింది. మంజుల సస్పెన్షన్ ఉద్యోగ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది.

విజయవాడకే తలమానికం

మల్లేశ్వరుని రథోత్సవం..

- 154 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం
- నేడు కెనాల్ రోడ్డులో వైభవంగా రథోత్సవం



రథోత్సవం (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో ఏటా జరిగే మల్లేశ్వరుని రథోత్సవం విజయవాడ నగరానికే తలమానికంగా నిలుస్తోంది. నగర వాసులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి వేల మంది భక్తులు ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివస్తుంటారు. శతాబ్దంన్నర కాలంగా నిరాటంకంగా జరుగుతున్న ఈ రథోత్సవాన్ని తిలకించడాన్ని ఎంతో అదృష్టంగా భక్తులు భావిస్తారు. సాధారణంగా ఒక రథంపై ఒక ఆలయానికి చెందిన ఉత్సవమూర్తులను ఊరేగించడం ఆనవాయితీ. కెనాల్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రథోత్సవంలో మూడు ఆలయాలకు చెందిన ఉత్సవమూర్తులు ఊరేగుతూ భక్తులను ఆశీర్వదిస్తారు. దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(దుర్గగుడి)కి చెందిన గంగ, పార్వతి సమేత శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)కు చెందిన గంగ, పార్వతి సమేత మల్లేశ్వరస్వామి, భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి, శ్రీ వసంత మల్లికార్జునస్వామి దేవస్థానం (బుద్ధవారి గుడి)నకు చెందిన గంగ, పార్వతి సమేత శ్రీ వసంత మల్లికార్జునస్వామి వార్ల ఉత్సవమూర్తులను ఈ రథంపై అధిష్టింపజేస్తారు. 154 సంవత్సరాలుగా క్రమం తప్పక.. శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ 154 సంవత్సరాలుగా రథోత్సవాన్ని క్రమం తప్పకుండా కనుల పండువగా నిర్వహిస్తోంది. ఏటా మహాశివరాత్రి తరువాత వచ్చే అమావాస్య తిథి ఘడియల్లో రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. కెనాల్‌రోడ్డులో జరిగే ఈ రథోత్సవానికి తరలివచ్చే భక్తజనంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోతుంది. అదే సమయంలో వన్‌టౌన్ రహదారులన్నీ జాతరను తలపించే విధంగా దుకాణాలతో దర్శనమిస్తాయి. పూర్వం ఈ మూడు ఆలయాలకు సరైన ఆర్థిక వనరులు లేకపోవడంతో 1870వ దశకంలో ఈ కమిటీ ప్రముఖులు ముందుకొచ్చి ఆయా ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలను జరిపించేవారని, ఆ తరువాత ఈ మూడు ఆలయాలకు సంబంధించిన ఉత్సవమూర్తులతో రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆ కమిటీ బాధ్యులు చెబుతున్నారు.

రథోత్సవానికి ఏర్పాట్లు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో రథోత్సవం నిర్వహించేందుకు కమిటీ బాధ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత మూడు ఆలయాలకు చెందిన ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేస్తారు. పోలీస్ కమిషనర్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించడం రెండు దశాబ్దాలుగా కొనసాగుతోందని నిర్వాహకులు చెబుతున్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు స్వామి ఆశీస్సులు ఉండాలి

ప్రభుత్వ విప్ పీఆర్కే



సత్రశాల(రెంటచింతల): సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వారికి దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్యాల మల్లికార్జున శర్మ, శివశర్మ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మానందరెడ్డి, ఈవో బుర్రి నెమిలిరెడ్డి నేతృత్వంలో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ శ్రీశైలం, త్రిపురాంతకం, కోటప్పకొండ, సత్రశాల దేవస్థానాలను సందర్శించి ప్రజా పాలన చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మల్లికార్జునస్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వెంట ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కరరెడ్డి, జెట్టిపాలెం సర్పంచి దావులూరి నాగమ్మ , దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నేతలు గొట్టం భాస్కర్‌రెడ్డి, కుందురు పేరిరెడ్డి, మేకపోతుల ఈశ్వర్‌రెడ్డి, గుండా కిశోర్ పాల్గొన్నారు.

ఏలేశ్వర స్వామి గట్టు భక్తులతో కిటకిట



లాంచీలో ఏలేశ్వరం గట్టుకు వెళ్తున్న భక్తులు

విజయపురిసౌత్: శ్రీశైల క్షేత్రానికి ఈశాన్య ద్వారంగా మహోన్నత దేవాలయంగా ప్రసిద్ధి చెందిన నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో సింహపురి కొండపై వెలసిన ఏలేశ్వరస్వామి జాతరకు శుక్రవారం భక్తులు భారీగా తరలి వచ్చారు. గట్టు హరిహర నామస్మరణతో మార్మోగింది. ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అనుపు నుంచి ప్రత్యేక లాంచీ సర్వీసులను నడిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఏపీ పర్యాటక శాఖకు లాంచీల ఆదాయం రూ.2.73 లక్షల ఆదాయం సమకూరింది.అలాగే విజయపురిసౌత్ లోని లాంచీ స్టేషన్ వద్ద శివాలయంలో పూజలు నిర్వహించారు.

త్రికోటేశ్వరుని సన్నిధికి తరలిన ప్రభలు



బరంపేట బాలసంఘం ప్రభ




ప్రశాంతినగర్ యూత్ ప్రభ


నాలోన శివుడు.. నీలోన శివుడు.. కొండపైనా శివుడు... మదినిండుగా పరమశివుడంటూ భక్తుల శివనామస్మరణతో శుక్రవారం రాత్రి ప్రభలు శ్రీత్రికోటేశ్వరుని సన్నిధికి తరలివెళ్లాయి. కోటప్పకొండ ఆలయం వద్ద జాగరణలో కొలువు తీరనున్నాయి. తీన్‌మార్ డప్పులు, డీజే సౌండ్స్, యువకుల నృత్యాలతో పట్టణంలో సందడి నెలకొంది. ప్రభల అలంకరణతో వివిధ గ్రామాల వారు పోటీ పడ్డారు. భారీ విద్యుత్ ప్రభలను పోలీసులు సూచనల మేరకు తరలించారు.

కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లేందుకు గ్రామాల నుంచి తరలివచ్చిన యాత్రికులతో బస్టాండ్, చిత్రాలయ సెంటర్ రోడ్లు కిటకిటలాడాయి. ఉదయం నుంచి వివిధ సంస్థల ఆధ్వర్యంలో కొండకు వెళ్లే యాత్రికులకు ఉచితంగా ప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోటప్పకొండ బస్టాండ్ వద్ద ప్రయాణికుల రద్దీ కనిపించింది.

-నరసరావుపేట ఈస్ట్



రామిరెడ్డిపేట యూత్ ప్రభ



మేదరబజారు ప్రభ

మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నే

- మోసగాడు చంద్రబాబుకు ఓటమి ఖాయం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ఓటమి భయంతో పొత్తుల కోసం పాకులాడుతున్నాడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని నర్సింగపాడులో వైఎస్సార్ విలేజ్ క్లినిక్, గుండ్లపల్లిలో సచివాలయం, విలేజ్ క్లినిక్‌లను గురువారం ప్రారంభించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిలకు నకరికల్లు వైజంక్షన్ నుంచి వందలాది ద్విచక్ర వాహనాలతో గుండ్లపల్లి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గుండ్లపల్లి గ్రామంలో నిర్వహించిన సభలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ ఓడిపోబోతున్నారని అన్నారు. దుర్మార్గపు పనులు చేస్తున్న పవన్‌కల్యాణ్ రాజకీయాలకు పనికి రాడని అన్నారు. సత్తెనపల్లిలో టీడీపీ తరఫున పోటీచేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ మూడుసార్లు పార్టీ మారాడని గతంలో అవినీతి తోనే బీజేపీ నుంచి వెళ్లగొట్టారని అన్నారు.

మంచిపనులే మళ్లీ వైఎస్ జగన్‌ను గెలిపిస్తాయి..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి పనులే మళ్లీ గెలిపిస్తాయని శాప్ చైర్మన్, రాష్ట్ర యూత్ విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన చంద్రబాబు ఇక ఏ హామీలు చెప్పే ధైర్యం లేక నా భార్యని తిట్టారని మొసలి ఏడుపులతో సానుభూతి పొందాలని కుయుక్తులు పన్నుతున్నాడని అన్నారు. నీతి, నిజాయితీ, నమ్మకానికి, ధైర్యానికి మారుపేరైన అంబటి రాంబాబును సత్తెనపల్లి నుంచి మరోసారి గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, సర్పంచి జూపల్లి మోషే, ఎంపీపీ ఎం.అనూరాధ, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్ బాషా, ఎంపీటీసీ సభ్యులు రేమిడిచర్ల కాశీ, అబ్దుల్లా, మండల యూత్ విభాగం అధ్యక్షుడు షేక్ నన్నేసా, కొత్తపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



గుండ్లపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

కోటప్పకొండలో ప్రభుత్వ స్టాళ్లు ఏర్పాటు

ప్రారంభించిన కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ దిగువన సమాచార పౌరసంబంధాలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ స్టాళ్లను ఏర్పాటు చేశారు. సందర్శనీయ స్థలాలు, అభివృద్ధి సంక్షేమ పథకాల చిత్రాలతో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సంయుక్తంగా ప్రారంభించి, తిలకించారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, వైఎస్సార్ క్రాంతిపథకం (డీఆర్‌డీఏ), ప్రకృతి వ్యవసాయం, పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ(మెప్మా), వ్యవసాయ, ఉద్యానశాఖ, లీగల్ మెట్రాలజీ, హ్యాండ్స్‌ఆఫ్ కంపాషన్, రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఇరువురూ కలిసి ప్రారంభించి తిలకించారు. రోడ్డు సేఫ్టీ పరికరాలను గురించి ఎన్‌జీఓ సంస్థ కన్వీనర్ డి.కనకదుర్గపద్మజ, జిల్లా కలెక్టర్‌కు చూపించి వివరించారు. సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలతో ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు తెలియచేసే చక్రం విశేషంగా ఆకట్టుకుంది. కాకినాడ కాజా స్టాల్ ఏర్పాటు చేయటం విశేషం. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, ప్రకృతి వ్యవసాయశాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డి.అమలకుమారి, వ్యవసాయశాఖ ఏడీఎం మస్తానమ్మ పాల్గొన్నారు.

రేపు ఓపెన్ చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన లాంలోని చలపతి కాలేజీలో రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలు జరుగుతాయని నిర్వాహకుడు ఎం.గోపీనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ప్రైజ్ మనీ కింద రూ.50,500తోపాటు ట్రోఫీలు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 97030 49378 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దాళి గిరిధర్, అనిల్‌యాదవ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, కుటుంబ సభ్యులు



కోటప్పకొండకు బస్సులో ప్రయాణిస్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్



స్వామి వారిని దర్శించుకునేందుకు వెళ్తున్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ దంపతులు



స్వామి వారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్



స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ మురుగుడు



పౌరసంబంధాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్

కోటప్పకొండపై ఉన్న త్రికోటేశ్వర స్వామిని ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం దర్శించుకుని పూజలు చేశారు.

– నరసరావుపేట

తెనాలి డబుల్ హార్స్ తాజా ఉత్పత్తి 'చిరుధాన్యాల లడ్డూ'

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఆవిష్కరణ



చిరు ధాన్యాల లడ్డు ప్యాకెట్

తెనాలి: ఆహార పరిశ్రమలో దేశవిదేశాల్లో గుర్తింపు పొందిన తెనాలి డబుల్ హార్స్‌కు అనుబంధ సంస్థ అయిన తెనాలి డబుల్ హార్స్ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ తన తాజా ఉత్పత్తి 'చిరుధాన్యాల లడ్డు' (మిల్లెట్ లడ్డు)ను ఆవిష్కరించింది. మహిళా సాధికారత, ఉపాధిపై కంపెనీకి గల అంకితభావాన్ని ప్రతిబింబిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మేనేజింగ్ డైరెక్టర్ మునగాల మోహన్‌శ్యాంప్రసాద్, డైరెక్టర్ లలిత, కంపెనీ ఉద్యోగులతో కలిసి ఈ ఉత్పత్తిని ఆవిష్కరించారు. శ్రామికశక్తిలో మహిళల పాత్రను ప్రోత్సహించే దృక్పథంతో స్థాపించిన తెనాలి డబుల్ హార్స్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ టీడీహెచ్ దిగ్గజ ఉత్పత్తి 'సున్నుండలు'తో తన ప్రయాణాన్ని ఆరంభించిన విషయం తెలిసిందే. మూడేళ్లలో ఉత్పత్తి శ్రేణిని విస్తరించింది. మొత్తం 40 రకాల్ని ప్రారంభించింది. తాజాగా ఆవిష్కరణ చేసిన పోషకమైన, రుచికరమైన ఉత్పత్తి చిరుధాన్యాల లడ్డు, సంస్థ ఉద్యోగుల అంకితభావానికి నిదర్శనమని తెలిపారు. ప్రిజర్వేటివ్స్, ఫ్లేవర్స్ లేకుండా స్వచ్ఛమైన రుచితో వినియోగదారులను ఆకట్టుకుంటుందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



దాచేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ దాసరి శివనాగరాజు చెప్పిన వివరాలు.. ప్రకారం సయ్యద్ జమాల్(46) మనుమరాలు శుభ కార్యక్రమానికి ద్విచక్రవాహనంపై జానీబాషా(45)తో కలసి తెలంగాణ వెళుతున్నారు. దాచేపల్లి మండలం తంగెడ సమీపంలోని భవ్యసిమెంట్ ఫ్యాక్టరీ వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఇదే సమయంలో వెనుకగా వస్తున్న లారీ వీరిపై నుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ నారాజు మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సత్రశాలకు పోటెత్తిన భక్తులు



భ్రమరాంబికాదేవి

సత్రశాల(రెంటచింతల): గంగా భ్రమరాంబ సమేత మల్లన్నస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మానందరెడ్డి, ఈఓ బుర్రి నెమిలిరెడ్డి పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. 45 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఈఓ బుర్రి నెమిలిరెడ్డి తెలిపారు. అన్నదాన సత్రాలలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమెల్సీ జంగా కృష్ణమూర్తి, జెడ్పీ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, తహసీల్దార్ ఎస్.రామ్‌మోహన్‌రావు, ఎంపీపీ పి.సంపూర్ణమ్మ, మాజీ ఎంపీపీ డి.చౌడేశ్వరి, మాజీ జెడ్పీటీసీ నవులూరి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కారెంపూడి సీఐ చిన్న మల్లయ్య, ఎస్‌ఐ కె. వెంకట నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు

సత్రశాల(రెంటచింతల): ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకు పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి దేవస్థానం ఈవో బుర్రి నెమిలిరెడ్డి, దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మానందరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు చిట్యాల శివశర్మ నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భ్రమరాంబికాదేవి ఆలయంలో, స్పర్శస్ఫటిక శివలింగం వద్ద కూడా పూజలు చేశారు. ఎస్పీ వెంట ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, కారెంపూడి సీఐ చిన్న మల్లయ్య, ఎస్‌ఐ కె.వెంకట నారాయణరెడ్డి ఉన్నారు.



సత్రశాలకు కృష్ణ జలాలతో వెళ్తున్న భక్తులు



ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా ఎస్పీ రవి శంకర్‌రెడ్డి